క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడి సస్పెన్షన్

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బంద్రు శ్రీకాంత్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించారని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినా పట్టించుకోకుండా వ్యవహరించడంతో పార్టీ అనుమతితో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నియామకం

పాలకుర్తి టౌన్: తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పాలకుర్తికి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ కోటూరి మావతారాయ్ నియామకం పత్రాన్ని ఆయనకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన రాష్ట్ర నాయకుడు పట్ట నాగరాజు, తాళ్లపల్లి నరేష్, దుర్గం వినోద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


సుధాకర్

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

పాలకుర్తి: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మహాత్మా గాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ కోరారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజిరెడ్డి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నోడల్ ఆఫీసర్ పోతుగంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ కళింగరావు, మాజీ సర్పంచ్ కారుపోతుల వెంకటయ్య, చింతకాయల శోభ, శ్రీనివాస్, శ్యాంసుదర్‌రావు, కవిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) జిల్లా కేంద్రంలో తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు పిన్నింటి నర్సింహరాములు, నాయిని రామస్వామి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సముద్రాల ఎల్లయ్య, తాటికాయల శోభన్‌బాబు, రవి, రామూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మల్లన్నను కలిసిన అనిల్‌గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బస్వగాని అనిల్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లన్నకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందించారు.

మల్లన్నను కలిసిన నాయకులు

బచ్చన్నపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మల్లన్నను శాలువాలతో సన్మానించి పూల బొకేలను అందించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు నల్లగోని వేణుగౌడ్, మచ్చ సందీప్‌కుమార్, లక్కర్స్ శ్రీకాంత్ ఉన్నారు.

సన్మానం

జనగామ రూరల్: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలో 135వ ర్యాంకు సాధించిన బానోత్ భరత్‌కుమార్‌ను ఆదివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. భరత్‌కుమార్ బంజారా, గిరిజన సంఘం నాయకులు మూడు లక్ష్మణ్‌నాయక్, అజ్మీరా స్వామి, భూక్య స్వామి, బానోత్ హరిలాల్, 2వ వార్డు కౌన్సిలర్ వాంకుడోతు అనిత, చందు, శారద పాల్గొన్నారు.

నేడు వేదలో స్వర్ణ ప్రాశన

జనగామ: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ హాస్పిటల్‌లో పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని నేడు(సోమవారం) ఉచిత స్వర్ణ ప్రాశన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 0 నుంచి 16 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఉచితంగా స్వర్ణ ప్రాశన ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- తేలికపాటి వర్షానికే బురదమయం
- జలమయమవుతున్న రోడ్లు
- అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు


ఇళ్లఎదుట నిలిచిన వర్షపు నీటిని చూపిస్తున్న కాలనీవాసులు


జలమయమైన ఇప్పగూడెం బస్టాండ్ నుంచి జీపీకి వెళ్లే దారి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో తేలికపాటి వర్షాలకే రోడ్లన్నీ బురదమయంగ మారుతున్నాయి. పలు కాలనీల్లో సీసీ రోడ్ల సౌకర్యం ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్లను ఇష్టారాజ్యంగా వేశారు. ముందుగా రోడ్లను లెవల్ చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా రోడ్లు వేసి అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపుకోవడంతో తేలికపాటి వర్షాలకే రోడ్లు జలమయం అవుతున్నాయి. ప్రధానంగా మూడో వార్డులో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇప్పగూడెం బస్‌స్టేజీ నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లే దారిలో గతంలో వేసిన సీసీ రోడ్డు లోతట్టు ప్రాంతాలుగా మారాయి. కాలనీలో ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. అదేవిధంగా గ్రామంలో పోస్టాఫీస్‌కు వెళ్లేదారి, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, ఎస్సీ కాలనీ రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయి. మేజర్ గ్రామపంచాయతీగా, రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న గ్రామంగా పేరున్న ఇప్పగూడెంలో రోడ్ల పరిస్థితి చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

అధికారులకు విన్నవించినా స్పందించని వైనం

గ్రామంలో రోడ్ల సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. లోతట్టు(డౌన్) ఉన్న కాలనీల్లో ముందుగా రోడ్లను లెవల్ చేసి తిరిగి సీసీ రోడ్లు పోస్తే సమస్య పరిష్కారం అవుతుంది. ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు, సంబంధిత అధికారులు ఎవ్వరూ రోడ్ల సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఏళ్ల తరబడి తిప్పలు తప్పడం లేదు. గత పాలకులు పట్టించుకోలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామంలోని రోడ్ల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామంలోని మూడోవార్డులో నెలకొన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలి. కాలనీలో సీసీ రోడ్డు దిగువన ఉండటంతో వర్షం వచ్చిందంటే రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు నిలుస్తుంది. సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలి.

\- పిట్టల మధు, గ్రామస్తుడు

ముందే చెప్పినా పట్టించుకోలేదు



కాలనీలో సీసీ రోడ్డు వేయడానికి ముందే సమస్య వస్తుందని చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. ముందుగా రోడ్డును లెవల్ చేసి సీసీ రోడ్డు వేస్తే సమస్య ఉండేది కాదు. తేలికపాటి వర్షం వచ్చినా రోడ్డంతా జలమయం అవుతుంది.

\- పల్లె రవీందర్, గ్రామస్తుడు

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

జనగామ: సమాజంలోని అవసరార్థులకు అండగా నిలిచేందుకు లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను విస్తరించాలని 320 ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాన్ మారియా హైస్కూల్‌లో జరిగిన రీజియన్ 6, 7, 8 క్లబ్ సారథుల శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్‌ల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ డి.లవకుమార్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, జిల్లా గవర్నర్ కన్నా పర్శరాములు, కార్యదర్శులు, కోశాధికారుల బాధ్యతల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె. భాస్కర్‌రెడ్డి, సి. హెచ్.రవీందర్‌రెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్, వి.శారద, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి, ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్యా, ఆర్.రమణారెడ్డి, ఎస్‌డీ హబీబ్, రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పజ్జూరి జయహరి, ఆర్.ప్రవీణ్ కుమార్, బజ్జూరి వేణుగోపాల్, ప్రసాద్, శ్రీనివాస్, పి.వెంకట్ రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

'రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తున్న సీఎం'

- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన సాగిస్తున్నారని, పిచ్చివాడి చేతిలో రాయిలా పాలన ఉందని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మార్పు కోరుకుంటూ కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్మరిస్తూ తెలంగాణ అస్తిత్వ ఆనవాళ్ల మార్పునకు రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చేసిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్, నాయకులు మాతంగి దేవయ్య, రాజన్‌బాబు, మారెపల్లి ప్రసాద్, గుర్రం చిట్టిబాబు, గుండె మల్లేష్, ఆకారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజయ్య

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటా..

చిల్పూరు: వీధికుక్కల దాడిలో మృతి చెందిన అభిరామ్‌నాయక్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఫత్తేపూర్ పంచాయతీ పరిధిలోని నూనావత్‌తండాలో శనివారం కుక్కల దాడిలో మృతి చెందిన గుగులోత్ మధు కుమారుడు అభిరామ్ నాయక్ కుటుంబాన్ని ఎమ్మెల్యే శ్రీహరి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, వైస్ ఎంపీపీ భూక్య సరితనర్సింహ, నాయకులు మామిడాల లింగారెడ్డి, రూప్లానాయక్, ఊమ్లానాయక్, చిర్ర నాగరాజు, గజ్జెల దామోదర్, ధరావత్ రవి, రమేష్, హుస్సేన్, భిక్షపతి ఉన్నారు.

రూ. 30 వేల సాయం

మండలంలోని ఫత్తేపూర్ పంచాయతీ పరిధిలోని నూనావత్‌తండాకు చెందిన గుగులోత్ అభిరామ్ నాయక్ వీధికుక్కల దాడిలో శనివారం మృతి చెందాడు. కాగా, బాలుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు వాట్సాప్ గ్రూపు ద్వారా విరాళాలు అందించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఆదివారం వరకు రూ. 30 వేలు రాగా బాలుడి కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు అందజేశారు. పోలేపల్లి రంజిత్‌రెడ్డి, సతీష్, చందు, సోనూలు ఒక్కొక్కరు రూ.1,000 చొప్పున పంపించారని మాజీ సర్పంచ్ రూప్లానాయక్ తెలిపారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన భాస్కుల భరత్ అనే యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడగా మృతుడి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం పరామర్శించారు. భరత్ మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని తెలిపారు. నాయకులు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, పడిశాల వెంకటేష్, అన్నెబోయిన భిక్షపతి, గోవిందు ఆనందం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.


సాయం అందజేస్తున్న గ్రామ పెద్దలు


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన తుఫాన్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందు ప్రవీణ్ తల్లి ప్రమీల, గోవిందు ఉప్పలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులను పరామర్శించారు. రజనీకుమార్, రజిత, ప్రసాద్, రాజు, ప్రవీణ్, నారగోని రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష


ఏకశిల బీఈడీ కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు


సెయింట్ పాల్స్ సెంటర్ వద్ద తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కొమురయ్య

జనగామ: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జనగామ పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో అధికారులు పరీక్షకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించారు. ప్రతీ కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.


చంటిపాపతో పరీక్షకు వచ్చిన అభ్యర్థి


చెవి కమ్మలు, కాళ్ల పట్టీలు తీస్తున్న మహిళ


ఆలస్యంగా రావడంతో గేటు బయట ఉన్న అభ్యర్థులు


హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


జనగామ: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు


నర్మెట: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జనగామ: జిల్లా కేంద్రంలోని సూర్యాపేటరోడ్డు కెమిస్ట్ భవన్‌లో లింగాలఘణపురం మండలం నెల్లుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 సంవత్సరంలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 30 ఏళ్ల తర్వాత స్నేహితులు కుటుంబ సమేతంగా కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: కళ్లెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నతనంలో చేసిన చిలిపి పనులను గుర్తుకు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

నర్మెటలో..

నర్మెట: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వినాయక గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 చదువుకున్న టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.


చిల్పూరు: మల్కాపూర్‌లో..


లింగాలఘణపురం: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నీడలేని బస్టాప్

- 6 మండలాలకు కూడలి చిన్నపెండ్యాల
- పట్టించుకోని అధికారులు


బస్సుకోసం ఎండలో వేచి చూస్తున్న ప్రయాణికులు

చిల్పూరు: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలో చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామ బస్టాప్ 6 మండలాలకు కూడలిగా ఉన్నా ఇక్కడ ప్రయాణికులకు మాత్రం నీడ లేదు. దీంతో నిత్యం వివిధ పనులపై వెళ్లే ప్రయాణికులు ఎండ, వానకు తట్టుకుని ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. జాతీయ రహదారిలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇక్కడ 200 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయాల్సి ఉండగా 150 ఫీట్లతో నిర్మాణ పనులు చేయడంతో పాటు సర్వీసు రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాలు చేపట్టకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. అంతేకాకుండా చిన్నపెండ్యాల గ్రామ బస్టాప్ క్రాస్ నుంచి తరిగొప్పుల వెళ్లే రోడ్డు ఇక్కడ ఎత్తుగా ఉన్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అక్కడే రోడ్డు పనులు చేపట్టారు. దీంతో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు కనీసం కూర్చునేందు స్థలం లేకుండా పోయింది.

ప్రమాదాలకు అడ్డాగా బస్టాప్..

ఆరు మండలాలకు చెందిన ప్రయాణికులకు ఇక్కడి బస్టాప్ పెద్దది. ఇక్కడి నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులకు అడ్డా ఈబస్టాప్. ఇక్కడ రాత్రి, పగలు తేడా లేకుండా ప్రయాణికులు దిగుతుంటారు. అయినా నేటికి సెంట్రల్ లైట్లు లేవు. ఇక రాత్రిల్లు రోడ్డు దాటుతున్న ప్రయాణికులు ఎందరో గాయ పడ్డ సంఘటనలు ఉన్నాయి.


ఎండలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సర్వీసు రోడ్డు నుంచే బస్సులు వెళ్లాలి..



బస్టాప్ వద్ద ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారిపైనే నిలుస్తాయి. దీంతో బస్సు ఎక్కడ వెళ్లి పోతుందోనని రోడ్డు దాటే క్రమంలో ఎందరో ప్రయాణికులు గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసు రోడ్డులో ఆర్టీసీ బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

\- బత్తుల గణేష్‌బాబు, విద్యార్థి

ఉచితం సరే..షెల్టర్ ఏది



ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమే. ఇంత పెద్ద బస్టాప్‌లో కనీసం ప్రయాణికుల కోసం షెల్టర్ ఏర్పాటు చేయక పోవడం ఎంత వరకు సమంజసం. ప్రతినిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడ ఎండకు, వానకు ఓర్చుకోవాల్సి వస్తోంది. ఇక నైనా అధికారులు స్పందించాలి.

\- అనూష, ప్రయాణికురాలు, తాటికాయల

ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్తా..



బస్టాప్‌లో ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. ముందుగా జాతీయ రహదారిలో సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయిస్తా.

\- టి. ఉమ్మ, ఎంపీటీసీ, చిన్నపెండ్యాల

బీజేపీ నాయకుల సంబురాలు

చిల్పూరు/బచ్చన్నపేట: ప్రధానిగా నరేంద్రమోదీ మూడో సారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా చిల్పూరు, బచ్చన్నపేట మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గంటె ఉపేందర్‌యాదవ్, గుగులోత్ మధునాయక్, తోట శ్రీనివాస్, బాల్నె శ్రీనివాస్, తోకల సంపత్ రెడ్డి, అరూరి ప్రణీతప్రదీప్, మునిపల్లి ప్రభాకర్, బేజాడి సిద్దులు, చెంద్రమౌళి, నాగేష్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజు, పురాణం రాంబాబు పాల్గొన్నారు.


చిల్పూరు: సంబురాల్లో నాయకులు


బచ్చన్నపేటలో..

రాష్ట్ర అభివృద్ధే సీఎం ధ్యేయం



బచ్చన్నపేట: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని బండనాగారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను ఓటర్లు ఆదరించారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విసిగిన ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. కొడవటూర్ దేవస్థాన కమిటీ డైరెక్టర్ ఆరేళ్ల భాస్కర్, నాయకులు మానెపల్లి భూమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.